### ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - గ్రామీణాభివృద్ధిశాఖ

# ఆంధ్రప్రదేశ్ సూక్ష్మరుణసంస్థలు (రుణ వితరణ నియంత్రణ) ఆర్డినెన్స్ 2010లోని ముఖ్యమైన నిబంధనలు

**సూ**క్ష్మరుణసంస్థల అధిక వడ్డీల వేధింపులనుంచి, బలవంతపు వసూళ్ల నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యులను రక్షించడం కోసం మన రాష్ట్ర ప్రభుత్వం "ఆంధ్రప్రదేశ్ సూక్ష్మరుణసంస్థల (రుణ వితరణపై నియంత్రణ) ఆర్డినెన్స్ (2010)" తెచ్చింది. ఈ ఆర్డినెన్స్ సూక్ష్మరుణసంస్థల అప్పుల వలయంలో చిక్కుకున్న స్వయం సహాయక సంఘాలకు ఆ సంఘాల సభ్యులకు వారి కుటుంబాలకు రక్షణగా నిలుస్తుంది. సూక్ష్మరుణసంస్థల ఆగడాలనించి మిమ్మల్ని కాపాడుతుంది. ఈ సందర్భాలలో...

## ▶ స్వయంసహాయక సంఘాల సభ్యులు పాటించవలసిన పద్ధతులు

- ❖ స్వయం సహాయక సంఘాల సభ్యులు ఒక్క సంఘంలోనే సభ్యత్వం కలిగి ఉండాలి. ఒకటి కంటే ఎక్కువ సంఘాల్లో సభ్యత్వం కలిగిన వారు మూడునెలల్లోగా ఏ సంఘంలో ఉండాలో నిర్ణయించేసుకోవాలి. వద్దనుకొన్న స్వయం సహాయక సంఘం వారికి కట్టవలసిన బకాయిలు లెక్కచేయమని అడగాలి. ఆ సంస్థలో తన సభ్యత్వాన్ని రద్దు చేసుకొంటున్నట్లు తెలియ జేయాలి.
- ❖ స్వయం సహాయక సంఘాల నాయకులు, సభ్యులు సూక్ష్మరుణ సంస్థల ఏజంట్లుగా వ్యవహరించకూడదు.
- ❖ గ్రూపులో రుణం కట్టలేని వారిని సూక్ష్మరుణసంస్థల తరఫున బలవంతంగా కట్టించడానికి ప్రయత్నించకూడదు. తోటి సభ్యులు వారి కుటుంబాలపై ఏరకమైన వత్తిడి తెచ్చినా, వారిని దూషించినా, అవమానకరంగా ప్రవర్తించినా ఈ ఆర్డినెన్స్ క్రింద శిక్షార్హమైన నేరమవుతుంది. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలి.
- ❖ సూక్ష్మరుణసంస్థ వలన ఏదైనా అన్యాయం జరిగినట్లయితే వెంటనే గ్రామీణాభివృద్ధిశాఖ ప్రాజెక్టు డైరెక్టరు గారికి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టరుగారికి ఫిర్యాదు చేయాలి.
- ❖ వివాదాల పరిష్కారానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఆశ్రయించవచ్చును.

## ▶ రుణాల మంజూరి

- ❖ సూక్ష్మరుణసంస్థలన్ని ప్రతి జిల్లాలో ప్రాజెక్టు డైరెక్టరు వద్ద నమోదు చేయించుకోవాలి. గ్రామంలో ఎవరైనా అప్పుఇస్తామని వస్తే నమోదు చేయించుకొన్నారో లేదో తెలుసుకోవాలి. నమోదు సర్టిఫికెట్ చూపించమని అడగాలి. సూక్ష్మరుణసంస్థ రుణం ఇవ్వబోయే ముందు నమోదు అధికారి వద్ద ముందస్తు అనుమతి తీసుకోవాలి.
- ❖ ఎవరైనా సభ్యురాలికి ఇప్పటికే రెండు రుణాలు ఉన్నట్లయితే మరో రుణం ఇవ్వరాదు.

## ▶ వడ్డీ రేట్లు

- ❖ సూక్ష్మరుణసంస్థల వడ్డీరేట్లను తమ కార్యాలయాలలో ప్రముఖంగా ప్రదర్శించాలి.
- ❖ వడ్డీ రేట్లను రుణగ్రహీతకు రాతపూర్వకంగా తెలియజేయాలి.
- ❖ తరుగుతున్న అప్పునిల్వపై వడ్డీ కట్టే విధానంలోనే వడ్డీని లెక్కించాలి. అంటే ఏ నెలకు ఆనెల కట్టిన అసలు మొత్తాన్ని మినహాయించి మిగిలిన అసలు మొత్తం పైననే వడ్డీ లెక్కకట్టాలి.
- ❖ వడ్డీ అసలును మించకూడదు.
- ❖ వడ్డీ తప్ప సర్వీసుచార్జీ, అప్లికేషన్ ఫీజు, రికవరీఫీజు, పొదుపు, ఇన్సూరెన్స్ వంటి రూపాలలో అదనపు వసూళ్ళు చేయరాదు. అలా వసూలు చేస్తే చట్టప్రకారం శిక్ష తప్పనిసరి.
- ❖ దినసరి, వారం వారం వాయిదాలలో అప్పులను వసూలు చేయరాదు. కనీసం నెలసరి వాయిదాకు తగ్గకుండా అప్పులు వసూలు చేయాలి.
- ❖ రుణ గ్రహీతకు ప్రతి చెల్లింపునకు రశీదు ఇవ్వాలి, అకౌంట్ స్టేట్‌మెంట్ (ఖాతాపత్రం) ఉచితంగా అందజేయాలి.

▶ వసూళ్ళు

❖ సూక్ష్మరుణసంస్థలు బలవంతపు వసూళ్ళకు పాల్పడరాదు. బలవంతపు వసూళ్ళు అనగా...

❖ బెదిరించి భయపెట్టి అప్పులు వసూలు చేయరాదు.

❖ తరుగుతున్న అప్పునిల్వపై వడ్డీ కట్టే విధానంలోనే వడ్డీని లెక్కించాలి. అంటే ఏ నెలకు ఆనెల కట్టిన అసలు మొత్తాన్ని మినహాయించి మిగిలిన అసలు మొత్తం పైననే వడ్డీ లెక్కకట్టాలి.

❖ రుణగ్రహీత ఇంటికి తరుచుగా రుణం వసూలు కోసం వెళ్లడం సమయాసమయాలు పాటించకపోవడం వేదింపుల క్రిందికి వస్తుంది.

❖ సూక్ష్మరుణసంస్థలు వసూలు ఏజంట్లను నియమించుకోరాదు. అనుమతి పొందని వ్యక్తుల ద్వారా బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న సంస్థలపై చట్టప్రకారం చర్యవుంటుంది. సంఘాల సభ్యులు ఈ విషయంపై ఫిర్యాదు చేయాలి.

❖ వసూలుకి వచ్చినవారిని సూక్ష్మరుణసంస్థ ఉద్యోగి అవునో కాదో తెలుసుకోవడానికి గుర్తింపుకార్డు, సంస్థ నమోదు పత్రం మొదలగునవి చూపమని అడగవచ్చు. నమోదు చేయించుకోకుండా సూక్ష్మరుణసంస్థలు వ్యాపారం సాగిస్తే మూడేళ్ళు జైలు, జరిమానా శిక్షకు అర్హులు.

❖ పంచాయితీ కార్యాలయాల్లో, పట్టణాల్లో అయితే పట్టణ సమాఖ్య కార్యాలయాల్లో వార్డు ఆఫీసుల వంటి ప్రజా స్థలాల్లోనే రుణాల చెల్లింపు జరగాలి.

❖ సూక్ష్మరుణ సంస్థలు నమోదు చేయించుకోకుండా వ్యాపారం చేసినా, అధిక వడ్డీలు వసూలు చేసినా, బలవంతపు వసూలు చేసినా, అనుమతి లేని రుణాలు మంజూరు చేసినా, వసూలు ఏజంట్లను పెట్టినా, ఇచ్చిన రుణాలకు తాకట్టుపెట్టుకున్నా, సెక్యూరిటీలు పెట్టుకున్నా ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించినట్లే అవుతుంది. ఉత్తర్వుల ప్రకారం శిక్షార్హులు.

❖ అప్పుకు సెక్యూరిటీగా పట్టాపుస్తకం, రేషన్‌కార్డు, భీమా పత్రాలు, ఇతర కుటుంబసభ్యుల నుంచి ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించి తీసుకెళ్లడం వంటివేకాక మరే ఇతరమైన సెక్యూరిటీలను తీసుకోరాదు.

❖ అసలుకి రెట్టింపు సొమ్ము వసూలు చేసినట్లయితే అలాంటి రుణాలు రద్దవుతాయి. ఎక్కువగా వసూలు చేసిన మొత్తాన్ని సూక్ష్మరుణసంస్థ రుణగ్రహీతకు వాపస్ చేయాలి.

▶ **ఆర్డినెన్స్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా తీసుకునే చర్యలు**

❖ రిజిస్ట్రేషన్ చేసుకోకుండా కార్యకలాపాలు నిర్వహించిన సూక్ష్మరుణ సంస్థల వారిపై 3 సంవత్సరాల వరకు కారాగారా శిక్ష లక్ష రూపాయల వరకు జరిమానా విధించబడును.

❖ ఆర్డినెన్స్‌లోని మిగితా నిబంధనలను ఉల్లంఘించిన వారికి ఆరు నెలలు జైలు శిక్ష మరియు / లేదా పదివేల రూపాయల వరకు జరిమానా విధించబడును.

❖ సంఘాలకు మరియు సూక్ష్మరుణ సంస్థలకు మధ్య తలెత్తిన వివాదాలను పరిష్కరించుటకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయబడుతాయి. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ముందుకు వచ్చిన వివాదాలు మూడు నెలల్లోగా పరిష్కరించబడుతాయి.

❖ ఏదైనా స్వయం సహాయక సంఘం కాని వారి సభ్యులు కాని ఏదైనా సూక్ష్మ రుణ సంస్థ ఆర్డినెన్స్‌లోని నిబంధనలను ఉల్లంఘించినట్లయితే రిజిస్ట్రేషన్ అథారిటీకి ఫిర్యాదు చేయాలి. సూక్ష్మరుణ సంస్థలపై చేయవలసిన ఫిర్యాదులు వ్రాత పూర్వకముగా ఇవ్వాలి. లేదంటే టోల్ ఫ్రీ టెలిఫోన్ నెం. **155321**కి కూడా ఫోన్ చేయవచ్చును.

కావున మండల సమాఖ్యలు గ్రామైఖ్య సంఘాలు స్వయం సహాయక సంఘాలలోని నాయకులంతా తమతమ సమాఖ్యల్లో సంఘాలలోని సభ్యులందరికి ఆర్డినెన్స్‌లోని అంశాలను తెలియజేసి సూక్ష్మరుణ సంస్థల బారిన పడకుండా వారిని చైతన్య పరచవలసినదిగా కోరుతున్నాను.

**ముఖ్య కార్యదర్శి**

**గ్రామీణాభివృద్ధిశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**